ఓయూ హాస్టల్‌లో.. పైకప్పు పెచ్చులూడి పడి..

విద్యార్థికి స్వల్ప గాయాలు

ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో టెక్నాలజీ హాస్టల్లో కూలిన పైకప్పు)

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 18:ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ హాస్టల్‌లో బాత్రూంలో పైకప్పు పెచ్చులూడిపడడంతో ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. తృటిలో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఆందోళన చెందిన విద్యార్థులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అప్రమత్తమైన పోలీసులు ప్రధాన రహదారిని మూసివేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పైకప్పు పెచ్చులు ఊడిపడటం తమకు సాధారణంగా మారిందని, ఎవరి తలపైనైనా ఆ పెచ్చులు పడితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉండాలన్నా, బాత్రూంకి వెళ్లాలన్నా భయమేస్తుందని వాపోయారు. ఇప్పటికైనా తమ హాస్టల్‌ని మూసేసి వేరే దగ్గర హాస్టల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న హాస్టల్‌లో తమకు గదులు కేటాయించాలని కోరారు. ఇలాంటి సమస్యలు ఉన్నా ఆందోళనలు చేయకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల అధికారులు విద్యార్థులతో చర్చలు జరిపినా ఫలితంలేకపోయింది. దీంతో విద్యార్థులు తమ ఆందోళనలను కొనసాగించారు. చివరికి బుధవారం వీసీతో విద్యార్థులకు మాట్లాడే అవకాశం కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

అర్మేనియాకు వీసాలు ఇప్పిస్తానంటూ మోసం

వెంగళరావునగర్, మార్చి 18:అర్మేనియా దేశానికి వర్క్ వీసాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.1.20 లక్షలకు టోకరా వేశాడో మోసగాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌కు చెందిన అరుశ్ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థను నిర్వహిస్తుంటారు. గత డిసెంబర్‌లో నరేశ్ అనే వ్యక్తి ద్వారా సయ్యద్ మదార్ పరిచయమయ్యాడు. తాను అర్మేనియా దేశంలో పని చేస్తున్నానని, ఆ దేశానికి వర్క్ వీసాలు ఇప్పించగలనని నమ్మించాడు. తన క్లయింట్స్ 8 మందికి వర్క్ వీసాలు ఇప్పించాలని అవినాశ్ కోరగా.. అందుకు ఒక్కొక్కరికి రూ.20వేలు అవుతుందని మదార్ చెప్పాడు. రూ.1.20లక్షలను మదార్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అర్మేనియా వర్క్ వీసాలంటూ డాక్యుమెంట్లను వాట్సాప్‌లో పంపాడు. ఆన్‌లైన్‌లో చెక్ చేయగా.. అవి నకిలీవని తేలింది. దీంతో మదార్‌ను నిలదీయగా.. పొంతనలేని సమాధానాలిచ్చాడు. తీసుకున్న డబ్బు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు చెల్లించలేదని.. బాధితుడిపై ఫైనాన్సర్ దాడి

కుత్బుల్లాపూర్, మార్చి 18: అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చే ఫైనాన్సర్ కు తిరిగి చెల్లించలేని ఓ బాధితుడిని నిర్బంధించి దాడికి పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో తన గోడును వెలిబుచ్చాడు. సుచిత్రలోని దుర్గా ఎస్టేట్ సువర్ణ పటేల్ రెసిడెన్సీకి చెందిన యశ్వంత్ (27) ఈవెంట్ ఆర్గనైజర్‌గా పని చేస్తున్నాడు. వృత్తిలో భాగంగా డిసెంబర్ 31న జరిగే ఈవెంట్‌కు అల్వాల్ పంచశీల కాలనీకి చెందిన తన స్నేహితుడి అన్న ఫైనాన్సర్ శ్రీనాథ్ రెడ్డి వద్ద రూ.5లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ప్రభుత్వం ఈవెంట్లను నిషేధించడంతో ఈవెంట్ ఖర్చుకు పెట్టిన డబ్బులు తిరిగి రాలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. తాను ఇచ్చిన డబ్బులను వడ్డీతో సహా ఇవ్వాలంటూ ఫైనాన్సర్ శ్రీనాథ్ రెడ్డి వేధింపులకు గురిచేశాడు. దీంతో వడ్డీకి తెచ్చి రూ.లక్ష చెల్లించాడు. మిగతా డబ్బు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. నిత్యం వేధిస్తున్నట్లు బాధితుడు తెలిపాడు. ఈనెల 14న హోలీ సందర్భంగా కలుద్దామని శ్రీనాథ్‌రెడ్డి బాధితుడిని తన వద్దకు రప్పించుకొని.. మద్యం తాగించాడు. డబ్బుల విషయంలో మాటామాట పెరగడంతో శ్రీనాథ్‌రెడ్డి తన అనుచరులతో దాడి చేశాడు. అక్కడితో ఆగకుండా కారులో ఈసీఎల్ తీసుకెళ్లి అర్ధరాత్రి వరకు దాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయంపై బయట చెప్తే చంపేస్తామంటూ బెదిరించి పంపడంతో బాధితుడు ఈ విషయాన్ని కుటుంబసభ్యులతో చెప్పగా.. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఈనెల 15న ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనాథ్‌రెడ్డిని ఇప్పటివరకు అదుపులోకి తీసుకోకుండా, దర్జాగా బయట తిరుగుతూ తన కుటుంబసభ్యులను బెదిరిస్తున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తనకు న్యాయం చేసేలా చూడాలని బాధితుడు కోరుతున్నాడు.

దొంగలు బాబోయ్ దొంగలు!

- సిటీలో ఆగంతకుల హల్‌చల్
- వీఐపీల ఇండ్లే టార్గెట్‌గా రెక్కీలు
- నగటున రోజుకు 4 దొంగతనాలు
- గతం కంటే పెరిగిన చోరీలు
- నిఘా వైఫల్యమే అంటున్న నగరవాసులు

సిటీబ్యూరో, మార్చి18(నమస్తే తెలంగాణ): ఫిల్మ్‌నగర్ రోడ్ నంబర్-8లోని సినీహీరో విశ్వక్‌సేన్ సోదరి ఇంట్లో దొంగతనం జరిగింది. తెల్లవారుజామున ఐదున్నర గంటల సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మూడో అంతస్తులోని విశ్వక్‌సేన్ సోదరి రూమ్‌లోని బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. కేవలం 20నిమిషాల్లో ఈ దొంగతనం చేశాడని పోలీసులు చెబుతున్నారు.

–షేక్‌పేటలోని డైమండ్‌హిల్స్‌లో తాళం వేసిన ఇంట్లో 34 తులాల బంగారం, రూ.4.5లక్షలు, 550 కెనెడియన్ డాలర్లు దుండగులు ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడటమే కాకుండా సీసీ కెమెరాల్లో తమ వీడియోస్ కనిపించకుండా సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌తో సహా ఎత్తుకెళ్లిపోయారు.

కేవలం వారంరోజుల్లో జరిగిన ఘటనలు..

మూడునాలుగు రోజుల్లోనే వీఐపీలు ఉండే కాలనీలో దొంగలు యథేచ్ఛగా తమ పని తాము చేసుకుపోతున్నారు. ఓ వైపు అదే ఏరియాలో అదే జోన్‌లో దొంగతనాలు, రెక్కీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

హైదరాబాద్‌లో దొంగల స్వైరవిహారం..

నగరంలో గత కొంతకాలంగా వరుస దొంగతనాలు జనాలకు దడ పుట్టిస్తున్నాయి. చోరీలకు చెక్‌పెట్టాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. దీంతో నేరగాళ్లు అదును చిక్కితే చాలు దొంగతనాలు, దోపిడీలు చేస్తూ భారీగా సొమ్ములు దోచుకుంటున్నారు. కొత్తగా ధనవంతులు, వీఐపీల ఇండ్లే టార్గెట్‌గా ఆగంతకులు చోరీకి ప్లాన్ చేస్తున్నారు. కొన్నిచోట్ల చోరీలు జరుగుతుండగా.. మరికొన్ని చోట్ల రెక్కీ నిర్వహించి అనుకూల సమయాల్లో కొట్టేసే ప్లాన్‌లో ఉంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దాదాపుగా పాత నేరస్తులే ఈ చోరీలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు.గతం మాదిరిగా సాధారణ దొంగతనాలు కాకుండా ఒక్క దెబ్బతో సెటిలయిపోవాలన్న లక్ష్యంతో వీరు చోరీలకు ప్లాన్ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే దొంగతనాలకు పాల్పడిన వారిని సాంకేతికత సాయంతో పట్టుకుంటున్నా సొమ్ము రికవరీ చేయడంలో మాత్రం పోలీసులకు కష్టమవుతున్నది. దొంగతనాలకు పాల్పడే వారు పక్కాప్లాన్‌తో తాము చోరీ చేయగానే పక్క రాష్ట్రాలకు సొమ్ములు చేరవేస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. అంతేకాకుండా మరో అడుగు ముందుకేసి తాము దొంగతనం చేసిన చోట సీసీ కెమెరాల్లో తమ రూపురేఖలు కనిపించకుండా జాగ్రత్త పడటం, అవసరమైతే కెమెరాలు ధ్వంసం చేయడమో చేస్తున్నారు.

నగటున రోజుకు 4 దొంగతనాలు!

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం 71 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. 15 వేల మంది పోలీసులు, ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సిటీలో ఉంటున్నవారి రక్షణతో పాటు దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చూడటానికి 5లక్షలకు పైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్లతో పాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్‌కంట్రోల్‌లో 24 గంటల పాటు విధుల్లో ఉండేవారు నిరంతరం ఈ సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తుంటారు. అయినా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. కొందరు పగటిపూటే ఇళ్లలోకి చొరబడి విలువైన బంగారం, వెండి నగలతోపాటు నగదు దొంగిలిస్తుండగా.. మరికొందరు రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఇంట్లను సెలక్ట్ చేసుకుని రెక్కీ నిర్వహిస్తున్నారు. కాస్ట్ లీ ఏరియాలు, ధనవంతులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే చోరీలు ఎక్కువగా జరుగుతున్నట్లుగా పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సగటున రోజుకు నాలుగు దొంగతనాలు జరుగుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గతంతో పోలిస్తే సంవత్సర కాలంగా నేరాల సంఖ్య సగానికి పైగా పెరిగింది. ఒక్క దొంగతనాలే వందకు వంద శాతం పెరగడం పోలీసులకు దొంగలు కొత్త సవాల్ విసురుతున్నారు.

ఎండాకాలానికి ముందే..!

సమ్మర్ రాగానే పోలీసులు నగర ప్రజలకు సూచనలు చేస్తారు. ఇండ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు తమకు చెప్పమని.. కానీ ఇంకా సమ్మర్ హాలిడేస్ రానే లేదు.. నగరవాసులు ఇండ్లకు తాళాలు వేసి వెళ్లే పరిస్థితి రాకముందే నగరంలో దొంగతనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దీనికి నిఘా వైఫల్యమే కారణమని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా నేరస్తుల కదలికలను పసిగట్టే నిఘా విభాగం దొంగతనాలు జరుగుతున్నా.. అందులోనూ పాత నేరస్తులే ఎక్కువగా ఉంటున్నా కనిపెట్టలేకపోతున్నారంటే ఎంత నిర్లక్ష్యం ఉందో ఉన్నతాధికారులు పరిశీలించి పరిస్థితిని సమీక్షించాలని వారు కోరుతున్నారు. ప్రధానంగా భద్రత ఎక్కువగా ఉండే ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో చోరీలు, రెక్కీలు జరుగుతున్నాయి. ప్రధానంగా నగరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు రికార్డ్ చేసే ప్రతీ అంశాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్లలో పర్యవేక్షిస్తుంటారు. అయితే ఈ పని చేస్తున్న సిబ్బందిలో అధికశాతం మంది విధుల నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. కమిషనరేట్‌లో ఉన్న స్టేషన్ల పరిధిలో గస్తీ పెంచుతామని, పాత నేరస్తుల కదలికలపై కూడా దృష్టి పెడుతామని పోలీసులు చెబుతున్నారు.

డీకే అరుణ ఇంట్లో చోరీకి యత్నం.. ఢిల్లీకి చెందిన పాత నేరస్తుడి అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 18: బీజేపీ ఎంపీ డీకే అరుణ నివాసంలో చోరీకి యత్నించిన ఓ నేరస్తుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మూడు రోజుల కిందట జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 56 లోని ఎంపీ డీకే అరుణ నివాసంలోకి వెనుక డోర్ నుంచి ఓ ఆగంతకుడు ప్రవేశించి సుమారు గంటన్నర పాటు సంచరించిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించారు. కేసు వివరాలను వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ అక్రమ్(28) అనే వ్యక్తి గత కొన్నేండ్లుగా ఢిల్లీలో నివాసం ఉంటున్నాడు. అక్కడే టైల్స్ షాపులో పనిచేసే అక్రమ్ చోరీలకు పాల్పడుతున్నాడు. అతడిపై ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో సుమారు 30కి పైగా చోరీ కేసులు పెండింగ్ లో ఉన్నాయి. ఈ క్రమంలో కొత్త ప్రాంతాల్లో చోరీలు చేయాలని నిర్ణయించుకున్న అక్రమ్ 15 రోజుల కిందట నగరానికి వచ్చాడు. పాత బస్తీ భవానినగర్ లో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. హైదరాబాద్ లోని సంపన్నులు నివాసముంటున్న ప్రాంతం ఏదంటూ గూగుల్ లో సెర్ చేయగా.. జూబ్లీహిల్స్ అని తెలిసింది. దీంతో జూబ్లీహిల్స్ లోని ఏదైనా ఇంట్లో చోరీ చేయాలని నిర్ణయించుకున్న అక్రమ్ గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 56 లోని డీకే అరుణ ఇంటి వెనుకాల సరైన నిఘా లేకపోవడం, అక్కడి నుంచి లోనికి వెళ్లేందుకు అవకాశం కనిపించడంతో చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ముఖానికి మాస్క్ వేసుకొని ఎంపీ డీ.కె.అరుణ ఇంటి వెనుకాల గోడదూకి లోనికి ప్రవేశించిన అక్రమ్ ఇంట్లో సీసీ కెమెరాల వైర్ కట్ చేసి చోరీకి యత్నించాడు. ఇంట్లోని వస్తువులు చిందరవందర చేశాడు. అయితే అక్కడ నగదు లభ్యం కాకపోవడంతో పాటు అలికిడి వినిపించడంతో లాభం లేదనుకుని వచ్చిన దారి నుంచే వెనక్కి వెళ్లాడు. కాగా, సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా చోరీ యత్నం అనంతరం పాత బస్తీలోని భవానీనగర్ దాకా వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు నిందితుడు అక్రమ్ ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.

నగదు ఉంటేనే చోరీ..

నిందితుడిని అదుపులోకి తీసుకున్న జూబ్లీహిల్స్ పోలీసుల విచారణలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. చోరీకి యత్నించిన అక్రమ్ గతంలో ఢిల్లీలో పలు చోరీలకు పాల్పడ్డట్లు గుర్తించారు. అయితే బంగారం, ఇతర వస్తువులు చోరీ చేస్తే వాటిని అమ్మడం కష్టమని, అమ్మినా పోలీసులు రికవరీ పేరుతో వెంటాడుతుంటారని భావించిన అక్రమ్ కేవలం నగదు దొరికితేనే చోరీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. చోరీ చేసిన తర్వాత సులభంగా పారిపోయేందుకు అవకాశం ఉన్నందునే అ ఇంటిని ఎంపిక చేసుకున్నానని. ఎంపీ ఇల్లు అని తెలియదు అని విచారణ లో నిందితుడు వెల్లడించాడు.

గత రెండేళ్లలో పెరిగిన నేరాలు..

నేరం	2023	2024
రాబరీలు	101	219
ఇండ్లల్లో దొంగతనాలు	547	859
బందిపోటు దోపిడీలు	15	29
తాళాలు పగులగొట్టి చోరీలు	365	435
మర్డర్ ఫర్ గెయిన్	2	6

34 తులాల బంగారం, నగదు చోరీ

బంజారాహిల్స్, మార్చి 18: ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు బీభత్సం సృష్టించారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట సమీపంలోని డైమండ్‌హిల్స్ కాలనీలో నివాసముంటున్న వ్యాపారి ముజాహిద్ కుటుంబసభ్యులు ఊరెళ్లారు. ముజాహిద్ ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి తిరిగి మంగళవారం వచ్చేసరికి ఇంటి వెనుక తలుపు పగులగొట్ట ఉన్నాయి. ముజాహిద్ లోనికి వెళ్లి చూడగా..రెండు బెడ్రూమ్‌ల తాళాలు పగులగొట్టిన దుండగులు 34తులాల బంగారు ఆభరణాలతో పాటు సుమారు రూ.4.5 లక్షల నగదు, కొంత విదేశీ కరెన్సీ ఎత్తుకెళ్లారు. ఇంట్లోని సీసీ కెమెరాలు..డీవీఆర్ ధ్వంసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఫిలింనగర్ పోలీసులు క్లూస్ టీమ్ సాయంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ఆర్‌అండ్ బీ అసిస్టెంట్ ఇంజినీర్ అదృశ్యం

శ్రీనివాస్(ఫైల్)

ఖైరతాబాద్, మార్చి 18 : విధుల కోసం ఆఫీసుకు వచ్చిన ఓ అసిస్టెంట్ ఇంజినీర్ కనిపించకుండా పోయిన సంఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కూకట్‌పల్లిలో నివాసం ఉండే మార్ని శ్రీనివాస్ (57) ఎర్రమంజిల్ ఆర్ అండ్ బీ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీరింగ్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లి రాత్రి వరకు కూడా తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితులు, బంధువులు, తోటి ఉద్యోగులను ఆరా తీయగా ఫలితం లేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూతురిపై లైంగిక దాడి..తండ్రికి జీవితఖైదు

బాధితురాలికి రూ.2లక్షల నష్టపరిహారం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 18(నమస్తే తెలంగాణ): కన్న కూతురిపైనే కసాయి తండ్రి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు అమర్ నేపాలి(36)కు జీవిత ఖైదుగా ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి టి.అనిత మంగళవారం సంచలన తీర్పు వెల్లడించారు. శిక్షతోపాటు రూ.10వేల జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా 6 నెలలపాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.బాధితురాలికి రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్‌రెడ్డి కథనం ప్రకారం.. దోమల్‌గూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేపట్టి వాంగ్మూలాల్ని నమోదు చేశారు. బాలికగా వయస్సును నిర్ధారించేందుకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌ను కోర్టుకు సమర్పించారు. 2023లో బాధితురాలి తల్లి ఇండ్లల్లో పని చేసేందుకు వెళ్లగా బాలికపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొంది. బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసిన కోర్టు విచారణ చేపట్టింది. 2023లో కోర్టుకు దాఖలు చేసిన చార్జీషీట్ ఆధారంగా విచారణ చేపట్టిన కోర్టు నిందితుడు నేరం చేసినట్టు రుజువుకావడంతో శిక్ష ఖరారు చేశారు.

ఫొటోలు మార్ఫింగ్..యువతికి బెదిరింపులు

వెంగళరావునగర్, మార్చి18:ఎస్.ఆర్.నగర్‌కు చెందిన యువతి (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నది. ఏడాది కిందట నెక్లెస్ రోడ్డులోని లేక్ వ్యూ పార్క్ కు వెళ్లినప్పుడు అక్కడ తేమలి పుజారా రమేశ్ (24)అనే వ్యక్తి తాను పోలీసు కానిస్టేబుల్ ననీ యువతితో పరిచయం చేసుకున్నాడు. ఫోన్ నంబర్ తీసుకుని ఫోన్లు చేస్తూ.. మెసేజ్‌లు పంపి యువతితో స్నేహాన్ని పెంచుకున్నాడు. మంచి వ్యక్తని ఆమె నమ్మింది.ఎస్.ఆర్.నగర్‌లోని కాఫీ షాప్ లో కలిసినప్పుడు ఆమె ఫోన్ లోని కాంటాక్ట్స్ అన్నీ తన ఫోన్ కు ఫార్వార్డ్ చేసుకున్నాడు. ఆమెని బ్లాక్ మెయిల్ చేశాడు. నేను చెప్పినట్టు వినకపోతే నీ ఫొటోల్ని, వీడియోల్ని మార్ఫింగ్ చేసి అందరికీ పంపుతానని బెదిరించాడు.యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పుడు పత్రాలతో ప్లాట్ విక్రయం

మలక్ పేట, మార్చి 18:తప్పుడు వారసత్వ పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని అమ్మిన కుమారుడు, కొనుగోలు చేసిన భార్యాభర్తలను చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రవిరాజు కథనం ప్రకారం..బీఎన్.రెడ్డినగర్ కు చెందిన రాచమల్ల వెంకటమ్మకు లింగయ్య, నరసింహ సంతానం. మలక్ పేట ఫల్టాన్‌లో వెంకటమ్మ పేరిట ఇల్లు, ప్లాటు(210 గజాల స్థలం)ఉన్నది. పెద్ద కుమారుడు లింగయ్యకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నరసింహకు ముగ్గురు కుమారులు వెంకటేశ్, శ్రీనివాస్, రాజు, ఇద్దరు కూతుళ్లు శ్రీదేవి, భూదేవి. 1999లో లింగయ్య మరణించగా, అతడి ఐదవ కుమారుడు సురేందర్ తనకు వచ్చిన 105 గజాల సలంలో ఇల్లు నిర్మించుకున్నాడు. మిగిలిన 105 గజాల స్థలం నరసింహ వారసులుగా అతడి భార్య పుష్పమ్మది. 2006లో నరసింహ మృతితో ఆస్తి భార్య పుష్పమ్మ పేరిట అయింది.పుష్పమ్మ పెద్ద కుమారుడు వెంకటేశ్ మరణించగా, చిన్న కుమారుడు రాజు ఇల్లు వదిలివెళ్లిపోయాడు. మూడో కుమారుడు శ్రీనివాస్ బ్రాహ్మణపల్లిలో నివసిస్తున్నాడు. పుష్పమ్మ అప్పుడప్పుడు ప్లాటును చూసుకునేది. అనారోగ్యంతో పుష్పమ్మ కొన్నాళ్లుగా ప్లాట్ వద్దకురాలేదు. ప్లాటును విక్రయించాలనుకున్న పుష్పమ్మ గతేడాది సెప్టెంబర్ 30న ఎం.అమర్నాథ్ గౌడ్, కె.శ్రీనివాసరాజులకు విక్రయించి సేల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. మనవడు సంజయ్‌తో కలిసి వారికి అప్పగించేందుకు వెళ్లగా, లింగయ్య కుమారుడు సురేందర్ అతడి కుమారుడు వారిని అడ్డుకున్నారు. పుష్పమ్మ కుమారుడు శ్రీనివాస్ లీగల్ అఫిడవిట్‌ను సమర్పించి ఆ ఆస్తికి వారసుడిగా తప్పుడు వారసత్వ పత్రాలు సృష్టించి ఆ ప్లాట్‌ని తన పేరుట రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత సురేందర్ భార్య రాణికి విక్రయించాడు. పుష్పమ్మ ఆజంపుర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్లి ఆరా తీయగా, శ్రీనివాస్ తప్పుడు పత్రాలతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకుని రాణికి విక్రయించినట్లు చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో కూడా తప్పుడు వారసత్వ పత్రాలతో విక్రయించాడని తేలింది. దీంతో శ్రీనివాస్‌ను, ప్లాట్‌ను కొనుగోలు చేసిన సురేందర్, అతడి భార్య రాణి, ఆమె బంధువు సందీప్‌కుమార్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

సిటీబ్యూరో, మార్చి 18(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిపై సీరియస్‌గా ఉందని, డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎక్సైజ్‌శాఖ భవనంలో హైదరాబాద్ డివిజన్ ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు ఆయన క్యాష్ రివార్డులు అందజేసి మాట్లాడారు. డ్రగ్స్ కేసుల నిందితులపై కఠినంగా వ్యవహరించాలని, వారికి తాగునీటితో పాటు సంక్షేమ పథకాలు నిలిపివేయాలని సీఎం ఆదేశించారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు గుర్తించాలన్నారు. నగరంలో ఎక్కువగా డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ ఫెయిడ్ లిక్కర్, ఫ్యూరియస్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాలకు నెలవుగా ఉందని, ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్ టీమ్‌లు గుర్తించి సమయస్ఫూర్తితో కట్టడి చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. నార్కోటిక్, పోలీసు, ఇతర ఏజెన్సీలకు దీటుగా ఎక్సైజ్‌శాఖ పనిచేయాలని, మన పనితీరే మన డిపార్టుమెంట్‌కు పేరు తెచ్చి పెడుతుందనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఎక్సైజ్ శాఖ సామాజిక బాధ్యతతో డ్రగ్స్, మత్తు పదార్థాలపై అందరికంటే ముందు ఉండేలా చూడాలన్నారు. హైదరాబాద్ డివిజన్‌లో 16కేసుల్లో 41మందికి డైరెక్టర్ క్యాష్ రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈఎస్‌లు శ్రీనివాస రావు, స్మిత సొజన్యలతో పాటు సీఐలు జగన్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, కోటమ్మ, శిరీష, మహేశ్ పాల్గొన్నారు.

వృత్తిని ప్రేమించి, బాధ్యతగా పని చేయండి

ఎక్సైజ్ శాఖలో మహిళా కానిస్టేబుళ్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు వృత్తిని ప్రేమిస్తూ.. బాధ్యతగా పని చేయాలని ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ ఎన్.ఏ.అజయ్‌రావు అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా కానిస్టేబుళ్లతో ఫాస్టింగ్ అవుట్‌పరేడ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పరీక్షలు, పీటీ, శిక్షణ, అవుట్ డోర్ శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి ఎక్సై